క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వేర్వేరు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను నేడు(గురువారం) వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ రమ్యరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్తు 50శాతం సొమ్మును ముందస్తుగా చెల్లించి, మిగిలిన సొమ్మును వాహనం పొందిన తర్వాత అదే రోజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వడ్డెర సంఘం మండల కమిటీ ఎన్నిక



భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండల వడ్డెర కులసంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు వడ్డెర కుల సంఘం జిల్లా కన్వీనర్ అల్లెపు రవి, వడ్డెర సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు దారంగుల మంజుల తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించి సన్మానించారు. మండల అధ్యక్షుడిగా మిర్యాల మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా బత్తుల సతీశ్, ప్రధాన కార్యదర్శిగా వినోద్ కుమార్, సలహాదారుడిగా కస్తూరి పెద్దరమేష్, కోశాధికారిగా మిరియాల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా గొల్లన శివాజీ, గౌరవ అధ్యక్షుడిగా శివరాత్రి రమేష్ తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మండలంలోని వివిధ గ్రామ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా సతీశ్

రేగొండ : మండల కేంద్రానికి చెందిన మంతెన సతీశ్‌ను పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఏలగొండ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. మండలంలో పద్మశాలీల ఐక్యతకు, రాజకీయంగా ఎదుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



మొగిలి మృతదేహం

మొగుళ్లపల్లి : ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఇస్సిపేట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్సిపేటకు చెందిన కల్లుగీత కార్మికుడు గాజుల మొగిలి (52) రోజు వారి వృత్తిలో భాగంగా మంగళవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో కళ్లు తిరిగి చెట్టుమీద నుంచి పడ్డాడు. అక్కడే ఉన్న తోటి గీతకార్మికులు మొగిలిని చికిత్స నిమిత్తం పరకాలలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తాటి చెట్టుపై నుంచి పడడంతోనే బలమైన గాయాలు తగిలి మృతి చెందాడని మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

ఎన్నిక

ములుగు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా కొయ్యడ లక్ష్మిని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పెద్దబోయిన దేవేంద్ర ప్రకటించారు. జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర నాయకుడు ఇల్లందుల సుధాకర్ లక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల జయ, పారనందుల విజయ, ప్రవళిక, అన్నంపల్లి వసంత, గడ్డం సుకన్య, ల్యాడ ప్రేమలక్ష్మీ, మాదరి రాజక్క, ఫైమా సుల్తానా, లత, కొడారి విజయ, రజిత, సాంబలక్ష్మితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.కృష్ణ రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ఒలింపియడ్ పోటీలకు ఎంపికైనట్లు హెడ్మాస్టర్ సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

ములుగు రూరల్ : జీఓ 317 కారణంగా స్థానికత ను కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉప్ప స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రాంచంద్రాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి నూతన పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కనక రాజు, సంఘం మండల అధ్యక్షుడు మైనాల స్వామి, దిలీప్, ఆగయ్య, రాజయ్య, అరుణకుమారి, సునితాదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లిక్ చేశారో.. ఖాతా ఖాళీ

- రివార్డుల లింక్‌లు నమ్మొద్దు
- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

టేకుమట్ల : గతంలో ఎవరూ లేనిది చూసి దొంగలు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారం దోచుకువెళ్లేవారు. కానీ ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయి మన చేతిలో ఉన్న మొబైల్‌తో బ్యాంక్ ఖాతాల్లోని నగదును సులభంగా తస్కరిస్తున్నారు. అజాగ్రత్తగా, అప్రమత్తంగా లేకుంటే క్షణాల్లో నగదును బ్యాంక్ ఖాతా నుంచి ఖాళీ చేస్తున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.

మెసేజ్, లింకులతో జాగ్రత్త..

మారుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ తమ రోజువారి కార్యకలాపాల్లో మొబైల్‌ను వాడుతున్నారు. అయితే సైబర్ నేరగాళ్లు ఇదే అదనుగా అమాయకులకు కాల్ చేసి తాము బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, మీ బంధువులకు యాక్సిడెంట్ అయిందని పలు రకాలుగా నమ్మిస్తూ వారికి మెసేజ్, లింకులను పంపిస్తూ ఓటీపీ చెప్పమంటూ అడుగుతున్నారు. ఇది నిజమే అని నమ్మి కొందరు ఓటీపీ చెప్పగానే బ్యాంక్ ఖాతా నుంచి నగదును తస్కరిస్తున్నారు.సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఎంతో కష్టపడి సంపాదించుకున్న నగదు చేజేతులా పోగొట్టుకుంటున్నారు. మరికొంత మంది సైబర్ నేరగాళ్లు వాట్సాప్ గ్రూపులను హ్యాక్ చేస్తూ అచ్చం బ్యాంక్ నుంచి వచ్చినట్లు ఫేక్ లింక్‌లను పంపించడంతో వాటిని ఓపెన్ చేయగానే ఖాతా వివరాలు తెలుసుకుని అందులోని నగదును దోచేసుకుంటున్నారు. సైబర్ మోసాలపై పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా కొంతమంది అమాయకులు సైబర్ ఉచ్చులో చిక్కుకుని ఉన్న నగదును కోల్పోతున్నారు. బ్యాంక్ నుంచి నగదును కోల్పోయిన వెంటనే 1930కి కాల్ చేయాలని, అలాగే పోలీసులకు సమాచారం అందిస్తే కొంత మేర నగదును రికవరీ చేసే అవకాశం ఉంటుంది.

సైబర్ ఉచ్చులో చిక్కుకుని నగదు పోగొట్టుకున్న సందర్భాలెన్నో

- మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళకు ఇటీవల బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని కోరారు. దీంతో ఏమి తెలియని ఆ అమాయకురాలు నిజమే కావొచ్చని నమ్మి వెంటనే ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పింది. వెంటనే ఆమె ఖాతానుంచి రూ.24 వేల నగదు డ్రా చేసినట్లు మెసెజ్ రావడంతో తాను మోసపోయానని లబోదిబోమంది.
- టేకుమట్ల మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన మరో మహిళకు సైతం అదే రీతిలో కాల్ చేయగా ఓటీపీ చెప్పమనడంతో రూ.2లక్షల పైగా నగదును ఖాతా నుంచి కోల్పోయింది.
- కాల్వపెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ ఉచ్చులో చిక్కుకుని రూ.లక్ష నగదును కోల్పోయాడు.
- దుబ్యాల గ్రామానికి చెందిన మరో యువకుడు సైబర్ మోసానికి గురయ్యి రూ.60 వేల నగదును కోల్పోయాడు.



అవగాహన కల్పిస్తున్నాం..



తెలిసి తెలియక ఎంతో మంది అమాయకులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి నగదు పోగొట్టుకుంటున్నారు. అగంతకులు పంపే లింకులను, మెసేజ్‌లను ఎట్టి పరిస్థితిల్లోనూ ఓపెన్ చేయరాదు. ఫోన్ కాల్‌కు స్పందించరాదని నిత్యం సైబర్ క్రైం నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నాం. ఒక వేళ ఎవరైనా నగదు కోల్పోతే వెంటనే 1930కి కాల్ చేస్తే కొంత నగదును రికవరీ చేసే అవకాశం ఉంటుంది. ప్రతీ ఒక్కరు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి.

\- దాసరి సుధాకర్, ఎస్సై, టేకుమట్ల

క్రీడల్లో గెలుపోటములు సహజం

- శ్రీపాదట్రస్టు ఛైర్మన్ శ్రీనుబాబు



బహుమతులు ప్రదానం చేస్తున్న బాధ్యులు

కాళేశ్వరం : క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలని శ్రీపాద ట్రస్టు ఛైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. బుధవారం లేతకరి రాజబాపు-రమ్యలు నిర్వహించిన శ్రీపాదరావు స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. రాజకీయ నాయకులు, పోలీసులు, రిపోర్టర్‌లంతా ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. అనంతరం టోర్నీ విన్నర్ మాజాలెవన్ జట్టుకు రూ.10,116, రన్నర్ పూస్కుపల్లి టైగర్స్ జట్టుకు రూ.5,116 నగదు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మహదేవపూర్ మండలానికి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సరస్వతి పుష్కరాలకు రూ.25 కోట్ల నిధులు మంజూరుతో కాళేశ్వరం మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కోట రాజబాపు, కాటారం, మహదేవపూర్ సీఐలు నాగార్జునరావు, రామచంద్రరావు, ఎస్సైలు అభినవ్, పవన్‌కుమార్, తమాషారెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘భోజన’ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రేగొండ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కార్మికురాలు పద్మ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఐఎస్ నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచితేనే భోజనం అందించడం సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులకు వడ్డించేందుకు ప్రభుత్వమే నేరుగా కోడిగుడ్లు సరఫరా చేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మి, భాగ్య ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి ఎక్సైజ్ అధికారులు గుడుంబా నిర్మూలనకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పెద్దకుంటపల్లిలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటుసారాతో పాటు 1,200 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రమ్య తెలిపారు. గుడుంబా తయారీదారులను అరెస్ట్ చేసి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటుచేసి గుడుంబా నియంత్రణపై అవగాహన కల్పించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ దాడుల్లో భూపాలపల్లి ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ నిందితుల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

గణపురం : మండలంలోని ఓసీ-3 ప్రాజెక్టులో కాపర్ వైరు దొంగలించి బ్యాగుల్లో తరలిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కొందరు పరుశరాంపల్లి శివారు ఓసీ-3 ప్రాజెక్టులో కాపర్ వైరును దొంగలించి వారి స్వగ్రామాలకు వెళ్తున్న క్రమంలో గణపురం బస్టాండులో సదరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. రౌతు భరత్, పల్లెపు నర్సింహరావు, కల్లూరి కనకయ్య, రౌతు మల్లేశ్వరి, మక్కల రజిత, రౌతు రమాదేవి, బోదాసు చిట్టి ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద రూ.40వేల విలువ గల కాపర్ వైరు ఉన్నట్లు ఎస్సై వివరించారు.

‘కాంగ్రెస్ కనుసన్నల్లో గ్రామసభలు’



సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి, నాయకులు

కాటారం : ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలు కాంగ్రెస్ పార్టీ నాయకుల కనుసన్నల్లో కొనసాగుతున్నాయని మహాముత్తారం మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి ఆరోపించారు. మహాముత్తారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాముత్తారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులు నాయకులను స్టేజ్‌పై కూర్చోబెట్టడం విడ్డూరమన్నారు. పారదర్శకంగా కొనసాగించాల్సిన గ్రామసభల్లో అధికారి పార్టీ నాయకుల ఆధిపత్యం కొనసాగుతుందని విమర్శించారు. గ్రామసభల్లో వెల్లడించిన అర్హుల జాబితాలో పేర్లు లేని లబ్ధిదారులను దరఖాస్తు చేసుకోవాలని సూచించడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు మార్క రాముగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోవిందరావుపేట : సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సోమ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పస్రాలో గల పార్టీ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో రైతులు, కూలీలు, నిరుద్యోగులు, పేదలు, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

గ్రామసభల పేరుతో కాంగ్రెస్ మోసం

- ఆత్మ మాజీ ఛైర్మన్ దుర్గం రమణయ్య



మాట్లాడుతున్న దుర్గం రమణయ్య

ఎస్ఎస్‌తాడ్వాయి : ప్రజాపాలన అంటూ గ్రామసభల పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆత్మ మాజీ ఛైర్మన్ దుర్గం రమణయ్య విమర్శించారు. బుధవారం మండలంలోని నార్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుల ఎన్నికకు ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరుతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. నార్లాపూర్ గ్రామ కమిటీ సభ్యులుగా పత్తి గోపాల్ రెడ్డి, అజ్మీరా రతన్ సింగ్, ఇస్రం కృష్ణంరాజు, నల్లమొక్క లక్ష్మీనర్సయ్య, ముల్కం సమ్మయ్య, గోపాలపురం సతీష్,, సహోదర్, సుభాష్‌రెడ్డి, రాజు, సాంబశివరావును, నర్సాపూర్ పరిధి కమిటీ సభ్యులుగా పాయం కన్నయ్య, ముక్తి రామారావు, వట్టం శోభన్ బాబు, మంకిడి రవి, గోగు నరేష్, గుండెబోయిన సుధాకర్, విద్యాసాగర్, యాప సత్యంలను నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లయ్య, సమన్వయ కమిటీ సభ్యులు కాక లింగన్న, రేగ నర్సయ్య, రామసహాయం శ్రీనివాసరెడ్డి, పైడిపల్లి అశోక్, గడ్డం అరుణ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి రూరల్/టేకుమట్ల/మొగుళ్లపల్లి/చిట్యాల/రేగొండ : భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి మున్సిపల్ 14వ వార్డు జంగేడు, 12, 13వ వార్డు కాసీంపల్లితో పాటు గొర్లవీడు, టేకుమట్ల మండల కేంద్రంతో పాటు అంకుషాపూర్, సుబ్బక్కపల్లి గ్రామాల్లో, మొగుళ్లపల్లి మండలంలోని పిడిసిల్లలో, చిట్యాల మండలంలోని తిర్మలాపూర్‌లో, రేగొండ మండలంలోని పోచంపల్లి గ్రామంలో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని, అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవి పేర్కొన్నారు. అనంతరం అంకుషాపూర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులను అందజేసారు. గ్రామ సభల్లో టేకుమట్ల తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీఓ అనిత, ఎంపీఓ సురేష్, ఆర్ఐ సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మొగుళ్లపల్లి మండల ప్రత్యేక అధికారి సునీత, తహసీల్దార్ సునీనిత, ఎంపీడీఓ హుస్సేన్, చిట్యాల తహసీల్దార్ హేమ, ఎంపీడీఓ జయశ్రీ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, ఆర్ఐ రాజు,రేగొండ తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి సునీల్ కుమార్, ఏఓ వాసుదేవారెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, జ్యోతి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు

పలిమెల : మండలంలోని ముకునూరు, మోదేడ్ గ్రామ పంచాయతీల్లో బుధవారం అధికారులు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలను చదివి వినిపించి గ్రామ సభ ద్వారా అమోదం పొందారు. ఈ సభల్లో జీపీ స్పెషల్ ఆఫీసర్లు ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, ఈసీ శ్రీకాంత్, ఏఈఓ శరత్, ఈజీఎస్, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మల్హర్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు రెండోరోజు కొయ్యూరు, కొండపేట, ఎడ్లపల్లి, మల్లెంపల్లి, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. నూతన రేషన్ కార్డులో కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మల్లెంపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభను అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డీసీఎస్ఓ శ్రీనాథ్‌లు పరిశీలించారు. అర్హులకు న్యాయం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్ సుందర్ ఏఓ శ్రీజ, మాజీ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జడలపేటలో రసాభాస

చిట్యాల : మండలంలోని నైన్‌పాక, ఏలేటిరామయ్యపల్లి, ముచినిపర్తి, జడలపేట, తిర్మలాపూర్, రాంచంద్రాపూర్, ఒడితల, పాశిగడ్డతండా, కైలాపూర్ గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. జడలపేట సభలో గ్రామస్తులు పాల్గొని రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లలో తమ పేర్లు రాలేదని నిలదీశారు. అనంతరం అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.



పలిమెల: ముకునూరులో అర్హుల జాబితాను చదువుతున్న అధికారులు



మల్హర్: గ్రామసభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



చిట్యాల: జడలపేటలో నిలదీస్తున్న గ్రామస్తులు

బాధిత కుటుంబాలకు పరామర్శ



టేకుమట్ల: నివాళులర్పిస్తున్న మల్లయ్య

టేకుమట్ల : మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు సంగి రవి తండ్రి రత్నం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులను అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్ల మల్లయ్య పరామర్శించి, సానుభూతిని తెలిపారు. అలాగే మృతుడి చిత్రపటాలకి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన వెంట ఏవైఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు జన్నె యుగేందర్, మంద రమేష్, ఆరకొండ రాజయ్య, గోద భిక్షపతి, పుల్యాల భగత్, సంపత్, రాజు॥ రాజేందర్, చిన్ని, అంజి, తిరుపతి, రాకేష్, తదితరులు ఉన్నారు.

రేగొండ : మండలంలోని తిరుమలగిరికి చెందిన గంగుల చంద్రారెడ్డి మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు నిమ్మల విజేందర్, రొంటాల వెదకటస్వామి, పున్నం రవి, పట్టెం శంకర్, మంతెపూరి తిరుపతి, పన్నాటి శ్రీనివాస్, ఆకుతోట తిరుపతి, రొంటాల రఘు, లంసాని దేవేందర్ ఉన్నారు.

మంద కృష్ణపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

- చర్య తీసుకోవాలని ఫిర్యాదు

ములుగు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్ఎస్ తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన పసుల రామ్మూర్తిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి కర్ణాకర్ మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు మాదిగ బుధవారం ఎస్పీ డాక్టర్ శబరీష్‌కు ఫిర్యాదు చేశారు. రామ్మూర్తి మాదిగల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు జాతీయ నాయకుడు ఇరుగు పైడి మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌మాదిగ, నాయకులు రాంబాబు మాదిగ, దూడపాక రాజు మాదిగ, కార్తీక్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.



వాజేడు: పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

వాజేడులో..

వాజేడు : మందకృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలను తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నం స్వామి ఆధ్వర్యంలో వాజేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పేట సమ్మాలు, లేగల రవి, చిట్యాల రాకేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

విగ్రహ తయారీ రాతికి పూజలు



రాతికి పూజలు చేస్తున్న కాళేశ్వరం అధికారులు, స్థపతి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో మే 15నుంచి 26వ తేదీవరకు జరిగే సరస్వతి పుష్కరాల సందర్భంగా జ్ఞాన తీర్థం (వీఐపీ ఘాటు) వద్ద ఏర్పాటు చేస్తున్న సరస్వతీ మాత విగ్రహం తయారీకి అధికారులు తమిళనాడులోని మ హాబలిపురం వెళ్లారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో దేవాదాయశాఖ స్థపతి వల్లీనాయగం, కాళేశ్వరం ఆలయ ఈఓ ఏ.మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌లు సరస్వతీమాత విగ్రహ తయారు చేసే రాతికి ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. వారి వెంట అసిస్టెంట్ స్థపతి గణేశ్ పాల్గొన్నారు.